# పేరడైజ్ లాస్ట్

యెలిశెట్టి శంకరరెడ్డి

**సూర్యుడు** పడమటి కొండల వెనక్కి జారిపోతూ ఆకాశానికి కుంకుమ రంగు ప్రసాదించాడు. జీవితపు చరమాంకంతో చీకటి కమ్ముకొస్తూంది. తోటలో పక్షుల కిలకిలారావాలు అధికమవుతున్నాయి.

ముసురుకుంటున్న చీకటితెరల వెనక అస్పష్టంగా విషణ్ణ వదనంతో కనిపిస్తున్న తండ్రి వంక చూస్తూ నెమ్మదిగా అటు వైపు అడుగులు వేసింది సంధ్య.

గ్రీకు యుద్ధవీరుడులా, మూర్తీభవించిన గాంభీర్యంలా ఉన్నారు రాఘవరావుగారు. తండ్రి వదనంలో అస్పష్టంగా కదలాడుతున్న విషాదాన్ని చూసి అప్రయత్నంగా నిట్టూర్చింది సంధ్య.

"డాడీ!" నెమ్మదిగా పిలిచింది.

పక్కకు తిరిగి సంధ్య వైపు చూశారు రాఘవరావుగారు.

"సారీ, డాడీ! డిస్టర్బ్ చేశానా?"

లేదన్నట్టు తలూపారు రాఘవరావుగారు. క్షణంసేపు నిశ్శబ్దం తోటలో ఆ ఇద్దరి హృదయాల్లో చీకటి చిక్కబడుతూంది.

"డాడీ! రేపే కల్యాణ్ అన్నయ్య వస్తున్నాడు!"

"ఎస్, బేబీ! నాకు జ్ఞాపకశక్తి బాగానే ఉంది." పేలవంగా నవ్వుతూ అన్నారాయన.

"దెన్ డాడీ! మళ్ళీ ఏదో విపత్కర సంఘటన జరుగుతుందేమోనని నాకు భయంగా ఉంది, డాడీ."

"భయం దేనికమ్మా?" సంధ్య వైపు సూటిగా చూస్తూ ప్రశ్నించారాయన.

"డాడీ! ఎదురింటి కమలని మీరు చూశారు కదా! తనలో మన కోమలి వదిన పోలికలు ఎక్కువగా కనిపించటం లేదూ?"


"అవును! అయితే..." రాఘవరావుగారి భ్రుకుటి ముడిపడింది.

"డాడీ! మొదటిసారి తనని చూసి నేనే షాక్ తిన్నాను. పరధ్యాన్నంగా చూశానేమో కోమలి వదినే మళ్ళీ సజీవంగా నా ముందు నిలుచుందేమో నని భ్రాంతిలో పడ్డాను. రేపు కల్యాణ్ అన్నయ్య హఠాత్తుగా తనని చూస్తే అప్‌సెట్ అయి హర్ట్ అవుతాడు డాడీ! మానుతున్న వాడి గాయం రేగుతుంది." చెబుతూ ఆగింది సంధ్య.

"అందుకని ఏం చేద్దామంటావు?" కటువుగా ప్రశ్నించారు రాఘవరావుగారు. ఆ స్వరంలో కరుకుదనానికి బెదరి నెమ్మదిగా అంది సంధ్య:

"డాడీ! మనం వందనా ఆంటీతో మాట్లాడి ఒక నెల రోజుల పాటు కమలని ఎక్కడైనా పంపించేయమని రిక్వెస్టు చేద్దాం! ఆనందరావు అంకుల్ మీ స్నేహితుడే కదా! మీ మాట మన్నించక పోరు!"

"షటప్!" అన్నారు రాఘవరావుగారు. ఆయన మొహం కోపంతో ఎర్రబడింది. "చూడు సంధ్యా! నేను మిలిటరీ ఆఫీసర్ని. దేశం కోసం ధైర్య సాహసాలతో పోరాడి ఎన్నో అవార్డులు తీసుకున్నాను. నా కడుపున అలాంటి పిరికి వెధవ ఆఫ్టరాల్ ఒక ఆడదాని కోసం జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకున్న ఒక లూనటిక్ పుట్టినందుకే నేను బాధ పడుతున్నాను.




వాడి కోసం నేను నా స్నేహితుడి ముందు కెళ్ళి 'నా కొడుకు బలహీన మనస్కుడు ఒక ఆడదాని ప్రేమ కోసం కొట్టుమిట్టాడుతున్న పవల చిత్తుడు. వాడు నీ కూతుర్ని చూసి ప్రలోభ పడవచ్చు. అందుచేత వాడు ఈ వూళ్ళో ఉన్నన్ని రోజులు నీ కూతుర్ని ఎక్కడైనా పంపించు' అని దేబిరించనా? ఐ డోంట్ వాంట్ టు డూ సచ్ ఎ కైండ్ ఆఫ్ ఫూలిష్ థింగ్స్." కోపంగా అని చరచరా అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు రాఘవరావుగారు.

ఆయన వెళ్ళిన వైపే విచలిత అయి చూస్తూ ఉండిపోయింది సంధ్య. కన్న కొడుకు అంతరంగంలోని మూగబాధని అర్థంచేసుకోలేని ఆయన కర్కశత్వాన్ని క్షణకాలం పాటు అసహ్యించుకుంది. చాలా సేపైన తరవాత ఏదో నిర్ణయానికివచ్చినట్టు ముందుకు కదిలి ఆనందరావు గారింటి వైపు అడుగులు వేసింది సంధ్య.

• • •

బెడ్ మీద విసుగ్గా కదిలింది కమల. చేతిలో పుస్తకం మీద మనసు నిలవడంలేదు. ఎక్కడెక్కడో వూహాలోకాల్లో విహరిస్తూ సృష్టించిన కాల్పనిక సాహిత్యం. చికాగ్గా పుస్తకం పక్కన పడేసింది. కిటికీలోంచి వెన్నెల గదిలోకి ప్రవేశించడానికి తహతహలాడుతూంది. నైట్ క్వీన్ పరిమళాన్ని వెదజల్లుతూంది.

"కమల లేదా, ఆంటీ?" వరండాలో సంధ్య స్వరం వినిపించడంతో లేవబోయి మళ్ళీ ఎందుకో అలాగే ఒత్తిగిలి పడుకుంది.

"నిద్ర పోతున్నట్టుందమ్మా! నువ్వింకా పడుకోలేదా?" వందనాదేవి ఆప్యాయంగా అడిగారు సంధ్యని.

"లేదు, ఆంటీ. మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని వచ్చాను."

"ఏంటమ్మా?" నవ్వుతూ అడిగారు వందనాదేవి.

"ఆంటీ! నేను అడగబోయే విషయం మీకు సిల్లీగా అనిపించవచ్చు. కానీ నా కోసం జాగ్రత్తగా వినండి, ఆంటీ! నా కోరిక సమంజసం అవునో, కాదో మీరే నిర్ణయించాలి." మంద్రస్థాయిలో సంధ్య స్వరం గాలిలో వ్యాపిస్తోంది.

"ఆంటీ! నేను, కళ్యాణ్ అన్నయ్య ఇద్దరమే సంతానం కావటంతో డాడీ, మమ్మీ మమ్మల్ని గారాబంగా, మా స్వేచ్ఛకి ఏ విధమైన ఆటంకం లేకుండా పెంచారు. డాడీ మిలిటరీలో బోర్డర్స్‌లో పని చేస్తుండడంతో మా చదువులకు ఆటంకం రాకుండా మా ఇద్దర్నీ చిన్నప్పట్నుంచి విశాఖపట్నంలో మా అత్తయ్యగారింట్లో ఉంచి చదివించారు. సుభద్రత్తయ్య స్వయంగా నాన్నగారికి చెల్లెలు. మామయ్య కె. జి. హెచ్. లో పెద్ద పేరుమోసిన సర్జన్. వాళ్ళకి ఒక్కర్తే కూతురు, కోమలి. కోమలిని చిన్నప్పట్నుంచి కల్యాణ్ అన్నయ్య కిచ్చి పెళ్ళి చెయ్యాలనే ఉద్దేశం మా రెండు కుటుంబాలకూ ఉండేది. కల్యాణ్ అన్నయ్య, కోమలికూడా చిన్నప్పట్నుంచి ఆప్యాయంగా కలిసి మెలిసి తిరిగేవారు. వయసుతోపాటు వాళ్ళలో ఒకరిపట్ల ఒకరికి మమత, అనురాగం కూడా పెరిగిపోయింది. ఇద్దరూ ఒక్క క్షణంకూడా ఒకర్ని విడిచి మరొకరుండేవారు కాదు. వాళ్ళున్న చోట నవ్వులు, ఉత్సాహం, చైతన్యం కలిసి ప్రవహించేవి. అన్నయ్య



ఆ సంవత్సరం ఎమ్.ఎ. ఫైనల్ ఇయర్లోకి వచ్చాడు. కోమలి బి. ఎ. సెకండియర్ చదువుతోంది. వచ్చే సంవత్సరం ఇద్దరికీ చదువులు పూర్తి కాగానే పెళ్ళి చేసేయటానికి నిశ్చయించారు.

ఆ జంట జీవితంలో జేగంటలు మ్రోగితే వినటం బహుశా భగవంతుడికి ఇష్టం లేదేమో, అంటే! ఒక రోజు కల్యాణ్ అన్నయ్య, కోమలి సినిమాకు వెళుతుం — ఏక్సిడెంట్లో కోమలి చచ్చిపోయింది. కల్యాణ్‌కు కూడా బలమైన దెబ్బలు తగిలినా బ్రతికి బయట పడ్డాడు. బ్రతికిన జీవచ్ఛవంలా మిగిలిపోయాడు. వాడిలో సంతోషం, ఉత్సాహం మాయమై నిర్లిప్తత, నిస్తేజం ఆవరించుకున్నాయి. తర్వాత ఎప్పుడూ ఏదో ఆలోచనలో ఉన్నట్టు పరధ్యాన్నంగా ఉండటం మొదలెట్టాడు. వాణ్ణి ఓదార్చటం ఎవరి తరమూ కాలేదు. ఎంతగానో అభిమానించే నన్ను కూడా లక్ష్యపెట్టలేదు. వాడి కాలేజి ఫ్రెండ్స్



# విరాళు సముద్రం

—ఎల్.ఆర్.గ్రోవర్

కూడా వాణ్ణి మామూలు మనిషిని చేయలేక పోయారు సరికదా, వాణ్ణి ఆలుముకున్న గంభీరత్వాన్ని చూసి భయపడేవారు కూడా. తర్వాత చదువు మానేశాడు. త్రాగుడుకి అలవాటుపడ్డాడు. పగలూ, రాత్రీ త్రాగుడులోనే ప్రొద్దుపుచ్చసాగాడు. ప్రస్తుతం ఢిల్లీలో ఒక ఫైవ్ స్టార్ హోటల్లో పాప్ సింగర్‌గా పని చేస్తున్నాడు. ఆంటీ! అక్కడకూడా తన పని పూర్తి కాగానే ఒంటరిగా తన గదిలో గడుపుతాడని, ఎవరితోనూ కలవకుండా ముభావంగా ఉంటాడని వాడి స్నేహితు డొకడు అప్పుడప్పుడు ఉత్తరాల్లో వ్రాస్తుంటాడు. ఏం చెయ్యం, ఆంటీ? వాడి బ్రతుకు అలా అయిపోయింది...'' చెపుతున్న సంధ్య గొంతు పూడిపోయింది.

సానునయంగా సంధ్య తల నిమిరారు వందనాదేవి. అప్రయత్నంగా ఆవిడ కళ్ళు చెమర్చాయి.

క్షణం సేపాగి మళ్ళీ చెప్పటం ప్రారంభించింది సంధ్య:

"ఆంటీ! మమ్మీ ఆదంతా వాడి ఖర్మ అని వైరాగ్యంతో వాణ్ణి వదిలేసింది. డాడీ ఒక ఆడదాని కోసం అంతగా చలించిపోయిన వాణ్ణి అసహ్యించు కుంటున్నారు. చెల్లెలుగా నేను వాడికోసం ఏం చెయ్యాలి అంటీ? ముఖ్యంగా ఇప్పుడు తలెత్త బోతున్న సమస్య రేపు వాడు రావటంతో మీ కమలతో ప్రారంభం కాబోతుంది ...''

తన గదిలోంచి సంభాషణ వింటున్న కమల ఉలిక్కిపడింది.

వందనాదేవి ఆశ్చర్యంగా వినసాగారు.

"కమల, కోమలి—ఇద్దరికీ పోలికలు చాలా ఎక్కువ, ఆంటీ. మొదటి సారి కమలని చూసినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. మళ్ళీ కోమలి సజీవంగా నా ముందు నిల్చున్నట్లనిపించింది. ముఖ్యంగా కరుణతో నిండిన కళ్ళు, కోలమొహం, నవ్వుతున్నప్పుడు అందంగా మెరిసే పలువరస, ఒకే పొడవు, శరీర సౌష్ఠవం, ఆంటీ! మనిషిని పోలిన మనుషు లుంటారని సినిమాల్లో చూశాను. కథల్లో చదివాను. నా నిజ జీవితంలో చూస్తానని అనుకోలేదు. అన్నయ్య రేప్పొద్దుట వస్తున్నట్టు, ప్రశాంతంగా ఇక్కడో నెల రోజు లుండటానికి నిశ్చయించుకున్నట్టు ఉత్తరం వ్రాశాడు, ఆంటీ! కోమలిపోయి రెండు సంవత్సరాలు కావస్తోంది. ఈ రెండేళ్ళ కాలం వాడి జీవితంలో మార్పు తెచ్చి ఉండవచ్చు. వాడి హృదయంలో గాయం మాని ఉండవచ్చు. లేదా త్రాగుడుతో, మితిమీరిన వ్యభిచారం లాంటి దురలవాట్లతో మనిషి మొరటుదేరిపోయి అయినా ఉండవచ్చు. ఈ సమయంలో వాడు కమలని చూస్తే వాడికి కోమలి గుర్తొచ్చి తీరుతుంది. ఆ ప్రభావం వాడి మీద ఎలా పనిచేస్తుందో నే నూహించలేను, ఆంటీ! అందుకే దయచేసి నా దిక్కు దున్న నెల రోజులూ మీరు కమలని ఏ వూరైనా పంపించేయండి. ప్లీజ్, ఒక రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలుగా వాడి మీద అభిమానంతో, వాడి మనసుకు ఏ గాయమూ మళ్ళీ తగలకూడదనే స్వార్థంతో అడుగుతున్నాను, ఆంటీ! ఈ చిన్న కోర్కె మీరు తీర్చండి.'' కన్నీళ్ళతో అర్థించింది సంధ్య.

సంధ్య కన్నీళ్ళు తుడిచారు వందనాదేవి. అన్నయ్య మీద ఆ చెల్లాయి ప్రేమకు క్షణకాలం మనసులోనే సంతోషించారు కూడా. "ఐ పిటీ యూ, బేబీ! లోపల కమల ఉంటుంది. లేపి విషయం చెప్పి మీ ఇష్టం వచ్చినట్టు చెయ్యండి.'' చెప్పి తన గదిలోకి వెళ్ళి పోయారు వందనాదేవి.

అడుగులో అడుగు వేసుకుంటూ కమల గదిలోకి ప్రవేశించిన సంధ్య మంచం మీద కూర్చుని తన వైపే చూస్తున్న కమలని చూసి ఉలిక్కిపడింది.

"నువ్వు నిద్ర పోలేదా?'' భయం భయంగా అడిగింది సంధ్య.

లేదన్నట్లు తలూపింది కమల.

"అంతా విన్నావా?''

విన్నానన్నట్లు నెమ్మదిగా తల పంకించింది.

పది నిమిషాలు ఎవరి ఆలోచనలో వా ళ్ళుండి పోయారు.

"బయటకు వెళ్ళి మాట్లాడుకుందాం రా!', నెమ్మదిగా అడిగింది సంధ్య.

ఇద్దరూ బయటకు వచ్చారు.

ఎత్తైన అశోక వృక్షాలు ఈదురు గాలికి నవ్వుతూ నాట్యం చేస్తున్నాయి. దూరంగా కొబ్బరి తోటల పక్కనుంచి సెలయేరు చంద్రుడి వెన్నెల హారాల్ని తొడుక్కుని జిలుగు లీనుతూంది. విసురుగా వీస్తున్న గాలికి చెట్ల ఆకులు చేస్తున్న చప్పుడు, కీచురాళ్ళ ధ్వని తప్ప మరే శబ్దమూ లేదు.

"కమలా!'' ఏదో చెప్పబోతూ గేటు ముందు ఆగిన కారు చప్పుడు విని అటు చూసింది సంధ్య. గూర్ఖా గేటు తెరిచాడు. అక్కడే టాక్సీ దిగి వడివడిగా అడుగులు వేసుకుంటూ వీళ్ళని సమీపించాడు కల్యాణ్. క్షణం పాటు లేరి పారి కమలని చూశాడు. 'కోమలీ!' అస్పష్టంగా గొణిగాడు. అతని మస్తిష్కం మొద్దుబారింది. చేతిలోని సూట్‌కేస్ నేల మీద పెట్టి జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి ఒక సిగరెట్ వెలిగించాడు. క్షణకాలం కల్యాణ్ వైపు చూసింది కమల. ఎత్తైన మనిషి—నిర్మలంగా ఉన్న కళ్ళు. ప్రయాణపు బడలిక ప్రతిఫలిస్తున్నా చురుగ్గా ఉన్న మొహం. ఇరవై అయిదేళ్ళు దాటని వయసు— కోమలంగా ఉన్న మొహం—అమాయకంగా ఉన్న మూర్తి! ఇతనిలో సంధ్య చెప్పిన దుర్గుణాలన్నీ ఉన్నాయా? త్రుటిలో తనని చూడగానే అతని మొహంలో అవ్యక్తంగా కనిపించిన ఆశ్చర్యం, సంతోషం, కళ్ళలో వెలుగు...నో! ఇతనుచెడ్డవాడు కావటానికి వీల్లేదు. అతని కళ్ళలో అంతర్గతంగా మెరుస్తున్న ఆవేదన అతని గతానికి, మూర్తీభవించిన ప్రేమ మూర్తికి సంకేతం కావచ్చు.

'అవే కళ్ళు. అదే మూర్తి. ఇంపాజిబుల్. ఎలా నమ్మడం? సజీవశిల్పంలా తన కళ్ళ ముందు కోమలి! తను నిత్యం ఆరాధించే కోమలి. తనకోమలి...ఇక్కడ! ఈ అర్ధరాత్రి ఈ మారుమూల సాక్షాత్కరించటం! మై గుడ్‌నెస్! కల్యాణ్ కుమార్‌లో అవ్యక్త భావ ఘర్షణ—అంతరంగ మధనంలో ఆనంద తరంగం.

భయం భయంగా ఇద్దరివంకా కలియ చూస్తూ నిలుచుంది సంధ్య. చాలా సేపు ఎవరూ మాట్లాడ లేదు.

"అన్నయ్యా! ఈ అమ్మాయి మన డాడీ కొలీగ్ ఆనందరావుగారి అమ్మాయి కమల.

డాడీ, ఆనందరావ్ అంకుల్ ఇద్దరూ రిటైరయిన తరవాత ఇక్కడే ఇళ్ళు కట్టుకుని స్థిరపడిపోయారు.'' చెప్పి కమల వైపు చూసి అంది సంధ్య:

"బై దిబై, కమలా! ఇతను మా అన్నయ్య కల్యాణ్‌కుమార్! ఎ గుడ్ సింగర్.''

నమస్కారం పెట్టింది కమల.

చిన్నగా నవ్వుతూ తల వంచి బౌ చేశాడు కల్యాణ్.

"గుడ్‌నైట్! సీ యూ టుమారో!'' సూట్‌కేస్ చేతిలోకి తీసుకుని వడివడిగా వెళ్ళిపోయాడు కల్యాణ్.

సంధ్య, కమల కల్యాణ్ వైపే చూస్తూండి పోయారు. ఆలోచనల్లోంచి తేరుకుని అంది సంధ్య: "కమలా! చూశావుగా, ఇదివరకూ ఇంకా స్పోర్టివ్‌గా ఉత్సాహంగా ఉండేవాడు. అంతా విధి ప్రభావం. కాలం మనిషిని ఏమైనా చేస్తుంది. నిన్ను చూడగానే వాడి కళ్ళలో చిత్రంగా మెరిసిన కాంతిని చూశావా?'' చెబుతూ ఆగి మళ్ళీ అంది: "కమలా! అన్నయ్యను చూడు—వాడిలో అంతర్గతంగా, సుప్తంగా ఉన్న

వాడి మనసును చూడు. ఒక ఆడపిల్ల మరో ఆడపిల్లను ఇలాంటి కోరిక కోరకూడదని నాకు తెలుసు. అయినా అడుగుతున్నాను. వీలయితే వాణ్ణి మామూలు మనిషిని చెయ్యటానికి ప్రయత్నించు. ఇక్కడున్న కొద్ది రోజుల్లో నీ సాంగత్యం వల్ల వాడి జీవితం మరో కొత్త మలుపు తిరుగుతుందనే నమ్మకం నాకుంది.'' కళ్ళలో నీరు చిప్పిల్లుతుండగా గబాగబా చెప్పి వెళ్ళిపోయింది సంధ్య.

ఒంటరిగా మిగిలిపోయిన కమలలో చిత్రమైన స్పందన. అర్ధరాత్రి ఆకాశం మీదనుంచి ఒక నక్షత్రం రాలి నేల మీద పడింది.

'భగవంతుడా! ఏ బలహీనమైన క్షణంలోనూ నా మనసు మత్తులో పడకుండా చూడు.'

ఎక్కడో—ఎక్కడో అస్పష్టంగా మంచు తెరల వెనక మసగ్గా ఒక రూపం—పరిహసిస్తున్నట్లు—జాలిగా చూస్తున్నట్లు.

• • • •

మరునాటి రోజు మామూలుగా గడిచి పోయింది. సాయంత్రం అవుతుండగా తోటలో ఒంటరిగా కూర్చున్నాడు కల్యాన్. సంధ్య, కమల నెమ్మదిగా అక్కడకు వచ్చారు.

తలెత్తి చూసిన కల్యాన్ కళ్ళలో క్షణంపాటు వెలుగు.

"కూర్చో, కోమలీ! మృదువుగా అన్నాడు కల్యాన్.

"నా పేరు కోమలి కాదు—కమల!" వారిస్తున్నట్టు అంది కమల.

"మీరు మాట్లాడుతూ ఉండండి. నేను టీ తెస్తాను." చెప్పేసి అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయింది సంధ్య.

"సరి! కూర్చోండి, కమలా!"

కొంచెం ఎడంగా కూర్చుంది కమల.

చెట్ల కొమ్మల మీదినుంచి వచ్చే గాలి—గాలికి కదులుతున్న ఎండుటాకుల చప్పుడు చెట్ల కొమ్మల్లో కోయిలమ్మ పాడే సంగీతం—పరవశిస్తూ పారుతున్న జలపాతం.

ఈసారి ఒద్దిన తదేకంగా కమల వైపే చూస్తున్నాడు కల్యాన్ ప్రేమా? ఏమో? ఎక్కువ పరిచయమూ లేదు. ఎదలో తియ్యని స్పందన. అంతరంగికంగా బలమైన బంధం.

" మరి పిలిచాడు' కల్యాన్.

"కోమలికాదు, కమల." నవ్వుతూ చెప్పింది కమల.

"క్షమించండి. మిమ్మల్ని నేను కోమలి అనే పిలుస్తాను. ఇంకో దానికికూడా మీరు నన్ను క్షమించాలి. పరిచయమైన మొదటి క్షణం నుంచే మిమ్మల్ని ఏకవచనంతో సంబోధిస్తున్నాను." అర్థింపుగా అడిగాడు కల్యాన్.

"పరవాలేదు. ప్రతి మాటకీ క్షమార్పణ అడగటం మానసిక బలహీనతకి చిహ్నంగా గమనించ ప్రార్థన" నవ్వుతూ ట్రీట్‌మెంట్ మొదలు పెట్టింది కమల.

"అలా మనస్ఫూర్తిగా నవ్వే నవ్వంటే నా కిష్టం." మెరిసిన ఆమె పలువరస కాంతిలోకి తన్మయంగా చూస్తూ అన్నాడు కల్యాన్.

• • • •

ఆ తరవాత రోజులు చకచకా గడిచాయి.

ఆపోజిట్ సెక్స్‌తో స్నేహం త్వరగా బలపడుతుంది.

రోజులో ఎక్కువ భాగం కమల సన్నిధిలోనే గడుపుతున్నాడు కల్యాన్. విసుగూ విరామం లేకుండా కబుర్లు. మాటలు. ఎడతెరిపి లేకుండా ఎన్నెన్నో విషయాలు గంటల తరబడి మాట్లాడుకుంటుంటే రోజులు తియ్యగా గడుస్తున్నాయి కల్యాన్‌కి.

ప్రేమ—ప్రేమ భావనలో ఉన్న వాళ్ళు ఏం మాట్లాడుకుంటారు అనేది ఏ రచయితా ఏ కవీ వర్ణించలేడు. ఏ విషయమూ లేకుండా గంటలు, రోజుల తరబడి మాట్లాడుకోవడం ఒక్క ప్రేమ భావనలో ఉన్నవాళ్ళకి మాత్రమే చెల్లింది.

సిరిమావో బండార నాయకే, జిమ్మీ కార్టర్, రీగన్ ఫారిన్ పాలసీ, మన ముఖ్యమంత్రులు చేసే ఫీట్స్, వెన్నెల వెలుగు అందాలు, సన్నజాజుల పరిమళం, రంగనాయకమ్మ విసుర్లు, బీనాదేవి కథల్లో మెరుపులు సంజయ్ గాంధి చనిపోవటంలో అంతర్యం ఏదైనా ఉందా, చలం స్త్రీల కిచ్చిం దేమిటి? ఒక దానికి మరో దానికి సంబంధం ఉండదు. అయినా ఏవేం మాట్లాడినా ఇద్దరికీ బాగానే ఉంటుంది.

క్రమంగా కల్యాన్‌లో పెరుగుతున్న ఉత్సాహం—కల్యాన్‌లో ఉత్సాహం పెంచేందుకు చురుగ్గా, అల్లరిగా ప్రవర్తించే కమల. స్నేహం ప్లస్ ప్రేమా? ఏమో?

• • • •

"ఒక పాట పాడింది!",

"ఏం పాట పాడను?"

"మీ కిష్టం వచ్చిన పాట."

"నీ ఉంటే వేరే కనులెందుకు
నీ కంటే వేరే బతుకెందుకు
నీ పదములలోని అడుగులు నావే!"

గంభీరమైన స్వరం విశాలమైన ప్రకృతిలో కలిసి పరవశత్వం పొందుతూంది. ఒక సరికొత్త రాగ ప్రభంజనం ప్రభవించింది. క్షణకాలం పాటు తన్మయత్వం చెంది పరవశించింది కమల.

"ఈ పాట! మళ్ళీ ఇన్నాళ్ళకి! వాటే వండర్?" ట్రేలో టీ కప్పులతో పాటు వస్తూ అంది సంధ్య.

"అవును! కోమలి ప్రతి రోజు ఈ పాటే పాడించుకునేది." విషాదంగా అన్నాడు కల్యాన్.

కమల మొహం చిన్నబోయింది.

సంధ్య తప్పు చేసిన దానిలా బెరుగ్గా కమల వైపు చూసి ట్రే అక్కడ పెట్టేసి వడివడిగా వెనక్కి వెళ్ళిపోయింది.

"కల్యాన్!" పిలిచింది కమల.

తలెత్తి చూశాడు కల్యాన్. అతని బుగ్గల మీద జారుతున్న కన్నీటి చుక్క.

చూపుడు వేలితో కన్నీరు తుడిచి మెడచుట్టూ రెండు చేతులూ పెనవేసి తనవైపు లాక్కుని అతని నుదుటి మీద ముద్దు పెట్టుకుని "ప్లీజ్ ఫర్‌గెట్ ఎవ్విరిథింగ్ ఫర్ మై సేక్" అని నెమ్మదిగా అంది కమల.

ఆకాశంలో చంద్రుడు ఫక్కున నవ్వాడు. వెలుగుల జల్లు కల్యాణ్ మొహంలో ప్రస్ఫుటించింది.

• • • •

మగవాడు మైనం ముద్దలాంటి వాడు. ఆ మగవాణ్ణి మరో ఉన్నత సోపానంలోకి మలచగల నేర్పు మంట స్త్రీ. ప్రతి మగవాడి ఉన్నతికి కారణం స్త్రీ అదృశ్య హస్తం. అందుకే ఆడవాళ్ళు మీకు జోహార్లు అంటాడు ఒక రచయిత.

• • • •

'మీ అన్నయ్యలో సెన్సిటివ్‌నెస్‌ని చంపి మనిషిని చెయ్యమన్నావ్, సంధ్యా! కాని నేను ఓడిపోతున్నానా? ఏమో? తనలో తనే అనుకుంది కమల.

క్షణాలు నిశ్శబ్దంగా నవ్వుతూ నిమిషాల్లోకి దొర్లిపోతున్నాయి. వెన్నెల చల్లని కాంతుల్ని వెదజల్లుతోంది. నీలాకాశంలో తెల్లని మబ్బు తునకలు వడివడిగా ఎక్కడికో పారిపోతున్నాయి.

"ఏమైనా మాట్లాడండి," చిన్నగా నవ్వుతూ అంది కమల. ముత్యాల సేరు లాంటి ఆమె పలువరస మీద వెన్నెల కిరణం చిత్రంగా మెరిసింది.

కల్యాణ్ హృదయం క్షణకాలంపాటు లయతప్పింది.

"కోమలీ!" ఉద్వేగంగా పిలుస్తూ కమల చేతిని

—ఎన్. ఆర్. గౌరవర్

## గుసగుసలు



తన చేతిలోకి తీసుకున్నాడు కళ్యాణ్.

సుతారంగా అతని చేతిలోంచి తన చేతిని విడి పించుకుంది కమల.

హఠాత్తుగా కళ్యాణ్‌లో మెదిలిన ఎరాశ. ఎందుకో అతని మొహంలో విషాదచ్ఛాయలు ఆవరించు కున్నాయి. కరుణ నిండిన అతని కళ్ళు ఎక్కడో ఆలోచిస్తున్నట్టున్నాయి.

'మేన్ ఆఫ్ మెనీ మూడ్స్!' తనలో తనే అనుకుంది కమల.

క్షణంసేపు కమలలో చిత్రమైన స్పందన. ఆ స్పందనలో భావ్యం లేదు. అతన్ని తన హృదయం కేసి హత్తుకుని సేదతీర్చాలని ఆశ. మూగ కోరిక. ఆ కోరికలో లాలసత్వం లేదు.

"కళ్యాణ్!" చేత్తో తట్టి పిలిచింది కమల.

"ఊం..." ఆలోచనల్లోంచి బయటపడి ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు కళ్యాణ్.

"ఎక్కడికి! ఆలోచనల్లో ఎంతదూరం వెళ్ళిపోయా రేంటి?" అతని కళ్ళలోకి చూస్తూ

కోమలీ! ఐ లవ్ యూ!" కమల మొహంలోకి చూస్తూ అన్నాడు కళ్యాణ్.

"అమ్మయ్య! బ్రతికించారు. ఈ ప్రేమంతా కోమలి మీదగాని, నా మీదే అంటే మోయలేక పోయేదాన్ని ఈ బరువైన డైలాగులన్నీ!" నవ్వుతూ అంది కమల.

దెబ్బ తిన్నట్టు చూశాడు కళ్యాణ్.

"కోమలీ! ప్లీస్ ట్రై టు అండర్‌స్టాండ్ మీ. నేను ఊహాల్లో బ్రతికే మనిషిని. నీలాంటి మానసిక స్థైర్యం, మంచితనం ఉన్న నీలాంటి అమ్మాయి తోడుంటే నా జీవితంలో విషాదం మర్చిపోగలను."

"ఏం చెయ్యమంటారు, చెప్పండి. నేను ప్రాక్టికల్‌గా బ్రతికే అమ్మాయిని. మీరో ఇల్యూజనిస్ట్. మనిద్దరి మెంటాలిటీస్ ఎక్కడా కో ఇన్సైడ్ కావటం లేదు. మనిద్దరం కలిసి జీవితాన్ని వెళ్ళ దీర్చటం కష్టం!" కమలలో చిర్నవ్వు చెదిరి పోలేదు.


"కోమలీ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళి

కమలా?" జాలిగా అడిగాడతను. కళ్ళలో చిప్పిల్లిన కన్నీళ్ళు. నుదుటినిండా స్వేద బిందువులు అలుము కున్నాయి.

ఆకాశంలో నవ్వుతున్న చంద్రుణ్ణి మబ్బు తునకలు కమ్మేశాయి. కమల మొహంలో నవ్వు మాయమయింది.

"మీరింత సెన్సిటివ్ అయితే ఎలా? సెన్సిటివ్ నెస్ ఆడవాళ్ళ సొంతం. మగవాడు జీవితంలో ఎదురు దెబ్బలకి నిలబడ గలిగిఉండాలి. అంతేకాని మన శ్శాంతి కోసం పిచ్చి ప్రయత్నాలు చేస్తూ ప్రేమ భిక్షని అర్థిస్తున్నారంటే మీది పర్వర్టెడ్ మైండ్! మీ లైఫ్ పార్ట్‌నర్ సుఖపడటం కష్టం." ఆఖరి వాక్యాలు చెపుతున్నప్పుడు కమల హృదయంలో సన్నగా బాధ.

"సారీ, కోమలీ! మనశ్శాంతి వెతుక్కునే ప్రయత్నంలో దారి తప్పాను. ఇక మీదట ఎప్పుడూ మద్యం, మగువల జోలికి వెళ్ళను. నైట్ క్లబ్‌లో సింగర్ ఉద్యోగానికి కూడా గుడ్‌బై



—ఆర్.బి.షిండే

## చంకన చంటిపాపతో...

ప్రశ్నించింది కమల.

"కోమలీ! ఒకప్పుడు జీవితం పట్ల బాగా అనురక్తి పెంచుకున్నాను. నా ఆశలన్నీ మొగ్గలుగా వాడిపోతుంటే ఓటమిని తట్టుకోలేక పిచ్చిగా ఎండమావుల వెంట దాహం తీర్చుకుని సేదదీరాలని పరుగులెత్తి అలిసిపోయాను. నిన్ను చూసిన క్షణం నుంచి ఎందుకో శాంతిగా ఉంది. ఈ శాంతిని జీవితాంతం నిలుపుకోవాలని ఉంది."

చెపుతుండగా కమల పరిహాసంగా నవ్వటంతో బాధగా ఆమె వైపు చూసి ఉద్వేగంగా అన్నాడు కళ్యాణ్. "కోమలీ! మన పరిచయానికి ఎక్కువ వయసు లేదు. నన్ను నువ్వెలా అర్థం చేసుకుంటున్నావో నాకు తెలియదు. బట్, కోమలీ! ఐ వాంట్ యూ! నువ్వు నా జీవితంలో అడుగుపెట్టి నాలో పేరుకుపోయిన ఒంటరితనం, ఓటమి, పెసిమిజం, అలసత్వం అన్నీ నానుంచి దూరమైపోతాయి.

చేసుకోవా లనుకుంటున్నాను." హీనస్వరంతో అన్నాడు కళ్యాణ్.

"అబద్ధం! మీరు కోమలిని ప్రేమించారు. కోమలి పోలికలతో ఉన్న కమలని పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నారు" నుందలింపుగా అంది కమల.

"కోమలీ! అసలు నా మీద నీ అభిప్రాయం ఏమిటి?" చాలా సేపయిన తరవాత నెమ్మదిగా అడిగాడు కళ్యాణ్.

"జీవితంలో విషాదాన్ని తట్టుకోలేక ప్రక్కదారులు పట్టి మనశ్శాంతి కోసం ప్రయత్నించే పిరికి వాళ్ళు మీరు. ఒక స్నేహితుడిగా మీరంటే నా కిష్టం."

"స్నేహం కూడా త్యాగాన్ని కోరుతుందంటారు. నేను స్వార్థిని. నీ సాహచర్యంతో నా జీవితాన్ని మలుపు తిప్పటం కోసం, నా జీవితంలో చీకటిని పారద్రోలటానికి, నా కోసం నన్ను ప్రేమించ లేవా,

చెప్పేద్దామనుకుంటున్నాను. నా చదువుతో ఏదైనా ఉద్యోగం సంపాదించుకోలేకపోను. నువ్వు నా జీవితంలోకి రా! నీ సుఖ శాంతులకోసం నా జీవితాంతం కృషి చేస్తాను."

"నన్ను కాదు కోమలిని ఏం...?" చిలిపిగా అంది కమల.

"కమలా!" బాధగా అన్నాడు కళ్యాణ్. "అసలు నీకు ప్రతిమ అని పేరు పెట్టుండాల్సింది. ఎందుకంటే నువ్వు మనిషి రూపంలో ఉన్నదంత ప్రతిమవి కాబట్టి. నీ హృదయంలో ఎక్కడా స్పందన లేదా? ఇంతగా మనసు విప్పి మాట్లాడుతున్న నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయటం లేదంటే నిన్నేమనుకోవాలో తెలియటం లేదు." భారంగా కణతలు రుద్దుకుంటూ అన్నాడు కళ్యాణ్.

కమల హృదయం క్షణకాలం పాటు లయ తప్పింది. ఆ లయలో ఏదో అపశ్రుతి. అస్పష్టంగా

మంచు తెరల వెనక మసక మసగ్గా ఒక రూపం! దూరంగా ఎక్కడో!

అంతే! మత్తులోంచి తేరుకుంది కమల.

"చాలా రాత్రి అవుతూంది—వస్తాను!" చెప్పి లేచింది.

"మరోసారి ఆలోచించు, కమలా? నీ కిష్టం లేకపోతే నేనేమీ చెయ్యలేను. ఒక స్నేహితురాలిగా నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. బహుశా రెండు మూడు రోజుల్లో నేను వెళ్ళిపోవాలి. నా గతాన్ని, వర్తమానాన్ని దృష్టిలో పెట్టుకుని నా భవిష్యత్తును నిర్ణయించు. గుడ్‌నైట్!" మార్దవంగా చెప్పి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వైపే చూస్తూ ఆలోచనల్లో పడిపోయింది కమల.

జస్ట్ ఏన్ ఎటర్నల్ ట్రయాంగిల్ బిట్వీన్ కమల కల్యాణ్ అండ్ సంధ్య! జస్ట్ ఎ డెలికేట్ ట్రయాంగిల్ బిట్వీన్ కమల, కోమలి అండ్ కల్యాణ్! ఎప్పుడో అర్ధరాత్రి దాటాక తన గది చేరుకుంది.

• • •

టిక్ టిక్ మంటూ రేడియం డయల్ వాల్ క్లాక్ చప్పుడు కమల హృదయంతో పోటీ పడుతుంది. ముసురుకున్న ఆలోచనల తెమ్మెర...

కల్యాణ్! రియల్లీ ఎ రేర్ పర్సనాలిటీ. గొప్ప ప్రేమికుడు. దురదృష్టవంతుడు. అమాయకంగా ఉండే అతని మూర్తి, విషాదం నిండిన హృదయం... జీవితం లాలిస్తే...నో.నో. మై గాడ్! నా హృదయం ఇంత బలహీనమై పోతుందేమిటి? ప్రశాంతంగా సాగిపోతున్న నా జీవన స్రవంతిలో హఠాత్తుగా చెలరేగిన అలలు. భగవంతుడా! ఏ బలహీనమైన క్షణంలోనూ నా మనసు మత్తులో పడకుండా చూడు.

తన ఆలోచనల్ని చూసి పరిహాసంగా నవ్వుతున్నట్టు మసక మసగ్గా ఒక రూపం...దూరంగా ఎక్కడో మంచు తెరల వెనక. ఎవరు? ఎవరు?? ప్రదీప్!!! డాడీ బోర్డర్స్‌లో పని చేసేటప్పుడు పరిచయమైన లెఫ్టినెంట్ ప్రదీప్. ఆరడుగుల విగ్రహం! స్వచ్ఛంగా నవ్వివి ప్రతిఫలించే కళ్ళు.

సిమ్లా గెస్ట్‌హౌస్‌లో, కాశ్మీర్ లోయల్లో విహరించేటప్పుడు పెనవేసుకున్న చేతులు—కలిసిన ఆత్మలు.

ఏడీ! ఏడీ! ప్రదీప్!!


కలిసిన ఆత్మల అనుబంధాలు.

ఈ జన్మలోనే విడిపోతాయా?

నో! నో!నాటెటాల్! నెవర్! ప్రదీప్ భౌతికంగా యుద్ధంలో చచ్చిపోయి ఉండచ్చు. తన హృదయంలో శాశ్వతంగా ఉన్నాడు. ఎప్పటికీ! ఎన్ని జన్మలకైనా ఉంటాడు.

మరి కల్యాణ్! జాలిపడతాను. ఒక స్నేహితుడుగా జాలిపడతాను, సెన్సిటివ్‌నెస్ నింపుకున్న పిచ్చి ప్రేమికుడిగా!

'మరి అతన్ని ప్రేమించలేవా?' అంతరాత్మ అభ్యర్థన.




ఆకాశంలోనుంచి చలం ఫక్కున నవ్వాడు.

'పిచ్చిదానా! ఇష్టానికి, ప్రేమకీ పెద్ద దూరం లేదు. అతన్ని ప్రేమించు. ప్రేమించు. నిన్ను ప్రేమించే మనుషుల్ని నువ్వు ప్రేమించటం న్యాయం!'

క్షణం నిశ్శబ్దం. మౌనం. చీకటి పాడే గీతాలు.

'సారీ, చలం! ప్రేమ ప్రయాణం చేసి చేసి నో పూర్ణ బిందువు దగ్గర ఆగిపోవాలి. లేకపోతే అక్కడ మనిషి పతనం ప్రారంభ మవుతుంది.'

అంతే! ప్రేమ నో పూర్ణ బిందువు దగ్గర ఆగి తీరాలి.

• • •

"కోమలీ! ఏం నిర్ణయం తీసుకున్నావు?"

"సారీ, కల్యాణ్! నీ ప్రేమ మీద నాకు నమ్మకం లేదు. నిన్న కోమలి—ఈరోజు కమల—రే పెవరు?" వ్యంగ్యంగా అడిగింది కమల.

దెబ్బ తిన్నట్టు చూశాడు కల్యాణ్. "కమలా! నా మనస్సాక్షిగా చెబుతున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు లేకపోతే బ్రతకలేను."

రెండు నిమిషాలు ఆలోచించి అంది కమల:

"నన్ను నిజంగా ప్రేమిస్తే నేను చెప్పిన పని ఒకటి చెయ్యాలి. చేస్తావా?"

కల్యాణ్ కళ్ళలో మెరుపు!

"ప్రామిస్."

కమల చేతిలో చెయ్యి వేశాడు కల్యాణ్, ఏం ఆలోచించకుండానే.

కమల చెయ్యి వణికింది.

"మరో అమ్మాయిని పెళ్ళి చేసుకుని, నన్నెలా సుఖపెడతా నన్నావో అలా ఆ అమ్మాయిని సుఖ పెట్టు. అలా చెయ్యకపోతే నామీద ప్రేమలేనట్టే" అభ్యర్థన, లాలన, ఆజ్ఞ కలిపి చెప్పింది.

"కమలా! స్టాప్ దిస్ గేమ్. నా హృదయం అంతా నీ ముందు పరచానని ఇంత హేళనగా చూడకు. ఐ కాంట్ టాలరేట్!" ఆవేశంగా అన్నాడు కల్యాణ్.

"మై డియర్ పూర్ కల్యాణ్! నీకు ప్రేమంటే అర్థం తెలియదు. అందరూ నిన్ను ప్రేమించాలని తహతహలాడతావే తప్ప నువ్వెవర్నీ ప్రేమించవు. కోమలి, కమల కాకపోతే మరో విమల, నిర్మల ఎవరైనా నీ కొక్కటే!" హేళనగా నవ్వుతూ అంది కమల.

"కమలా! నువ్వేమన్నా పరవాలేదు. కానీ నువ్వు నా క్కావాలి. నీ చుట్టూ నో స్వర్గాన్ని నిర్మించుకున్నాను. ఆ స్వర్గాన్ని చేజారిపోనివ్వకు. నా జీవితంలో నో కలగా మిగిలిపోకు. నో తీపి నిజంలా నిండుగా నా జీవితంలో నువ్వు కలిసిపో ప్లీజ్. నేను నిన్ను ఆరాధిస్తున్నాను, కమలా!" అతని కళ్ళు వర్షించాయి. స్వరం వణికింది.

"అదే నేను అడిగేది. నీ ప్రేమ, ఆరాధన నిజం అని నిరూపించుకోవాలంటే నేను చెప్పినట్టు చెయ్యి. మన జీవితాలు మలుపుకున్న తీరులోనే స్వర్గం చేజారటం, నిర్మించుకోవటం ఉంటుంది. గుడ్‌బై" నవ్వుతూ అంది కమల.

చాలాసేపు స్థాణువులా ఉండిపోయాడు కల్యాణ్.

"నీ మీది నా ప్రేమని నిరూపించుకోవటం కోసమైనా నువ్వు చెప్పినట్టే చేస్తాను, కమలా! నువ్వు చెప్పినట్టే చేస్తా డీ పిచ్చివాడు. గుడ్ బై." నిరాశగా పలికి వెను దిరిగాడు కల్యాణ్.

కమల మొహంలో నవ్వు మాయమయింది.

'సంధ్యా! నువ్వు గెలిచావు.' గొణుక్కుంది కమల. అప్రయత్నంగా కళ్ళు తుడుచుకుంటుంటే చేతికి తగిలిన వెచ్చటి కన్నీళ్ళు!

'ఇదేమిటి, కన్నీళ్ళు తనకు?'

జీవితంలో మొదటిసారిగా కన్నీళ్ళు కారుస్తున్న కళ్ళా? మనస్సా??'

కన్నీటి తెర కప్పిన కళ్ళకు దూరంగా మసగ్గా కల్యాణ్ రూపం అస్పష్టంగా కనిపిస్తూంటే 'గాడ్ బ్లెస్ యూ, కల్యాణ్' అని మూలిగిం దామె మనసు.

'సంధ్యా! నువ్వు గెల్చావు సరే! మరి నేను గెల్చానా? గెలిస్తే నా కళ్ళలో నీ ళ్ళెందుకు?'

దూరంగా కనిపిస్తున్న కల్యాణ్ రూపం మాయమయింది

'కలసిన ఆత్మల అనుబంధాలు

ఏ జన్మకు విడిపోలేవులే..'

ఎక్కడో దూరంగా పాట మంద్ర స్వరంలో గాలిలో తేలుతూ వినిపిస్తోంది. ★